
మినీ కథ

# ఓ కండక్టర్ కథ




అరగంట నుంచి చైతన్యపురి బస్టాప్ లోని బస్‌లో కూర్చుని ఎదురు చూస్తున్నాను, కండక్టర్, డ్రైవర్ రాక కోసం! బస్ ఇక్కడ ఆపి వీళ్ళు ఎక్కడికి పోయుంటారబ్బా అని అనుకుంటున్నారు జనం. కాలనీకి ఉన్నది ఈ ఒక్కటే బస్సు. ఇది తప్పితే దిల్‌షుక్ నగర్ డిపో దాకా నడిచి ఇంకోటి ఎక్కాలి. ఇలా అనుకుంటూ ఉండగానే దూరంగా మూసీ నది ఒడ్డునుంచి ప్యాంట్లు సర్దుకుంటూ వస్తున్నారు కండక్టర్, డ్రైవర్లు.

అందరికి టిక్కెట్లు ఇచ్చిన తర్వాత బస్ కదిలి కాలనీ దాటి, హైవే క్రాసింగ్ దాకా వచ్చి మళ్ళీ ఆగింది. పక్క హోటల్ లోకి దూరారు కండక్టర్, డ్రైవర్లు. పావుగంట గడిచినా బయటకు రావడంలేదు. అసహనంతో నేను డ్రైవర్ క్యాబిన్ దగ్గరకి పోయి హారన్ మ్రోగించాను. హారన్ మ్రోగగానే కండక్టర్ హోటల్లో నుంచే "కోన్ రే హారన్ మార్‌నే కే వాలే- సువ్వర్ కె బచ్చె" అని అరిచాడు.

కండక్టర్ అలా అరవగానే అందరూ నాకేసి జాలిగా చూశారు. నాకు ఒళ్ళు మండింది. వెంటనే ఎవరు చూడకుండా డ్రైవర్ సీటు పైనున్న కండక్టర్ "టిక్కెట్స్ ట్రే"ని అందుకుని పక్కనే ఆగి వున్న ఆటో ఎక్కి ఇంటికి వచ్చాను.

మర్నాడు పేపర్లో: ఏ.పి.-జడ్ 8179 - కండక్టర్ - టిక్కెట్స్ ట్రే - సస్పెన్షన్ - దర్యాప్తు మొదలగు విషయాలు.

-బోయిన్‌పల్లి విజయ్‌కుమార్

మినీ కథ

# ఈ చదువు ఎవడికి కావాలి

సరిగ్గా నూరు సంవత్సరాలు పైబడి పెళ్లలూడుతున్న భవనంలో జిల్లా విద్యాశాఖాధికారి (డి.ఇ.ఓ.)గారి కార్యాలయం. బయట బెంచీలపై ఇంటర్వ్యూ దొరక్క గంటలతరబడి వేచివున్న జనం. కూచునే చోటులేక చింతచెట్టు కింద సిగరెట్లు, బీడీలు కాలుస్తున్న ఉపాధ్యాయులు. చికాకుగా, విసుగ్గా కొందరు బెంచీలపై మసలుతున్నారు.

"ఏంటయ్యా బాబు! చీటి పంపించి గంట గడిచిపోయింది. డి.ఇ.ఓ. గారిని కలుసుకోగలనా? లేదా?" అని ఓపిక నశించిన ముసలి ఉపాధ్యాయుని ప్రశ్న!

పక్కనే కూచున్న ఒక గవర్నమెంటు హైస్కూలు హెడ్‌మాస్టర్ మాధవయ్య అనుకోకుండా చాలా కాలం తరువాత కలిసిన మిత్రుడు సుబ్బయ్యతో కబుర్లు చెబుతున్నాడు. మరో గవర్నమెంటు స్కూలులో పనిచేస్తున్నాడు, సుబ్బయ్య. ఏదో మాటమీద సుబ్బయ్య. "మాధవయ్యా, నీదయ్యా అదృష్టమంటే! యెప్పుడైనా స్కూలుకు రోజూ వెళ్ళి నీ అసిస్టెంట్లు అసలు పాఠాలు చెబుతున్నారా, లేదా అని చూశావా! పోనీ నీవైనా నీ వంతు పాఠాలు చెబుతున్నావా? అవి ఏమీ లేకుండానే హాయిగా నెల జీతం పుచ్చుకుంటున్నావ్!"

మాధవయ్య "సరే లేవయ్యా, నేనేదో వెళ్ళకుండానే పని నడుపుతున్నాను. మరి నువ్వు చేస్తున్నదేమిటి? స్కూలుకు ప్రతిరోజూ వెళ్ళినా పిల్లలకు ఎప్పుడైనా పాఠం చెప్పిన పాపాన పోయావా? ఆ స్టాఫ్ రూంలో పేకాడడం తప్ప" అని పెద్దగా నవ్వాడు.

సుబ్బయ్య "ఇంకా మనం నయం! ఆ యూనివర్శిటీల్లో వేనకు వేలు జీతాలు తీసుకుంటూ సూట్లు వేసుకొని కార్లల్లో తిరిగే ప్రొఫెసర్లు వారానికి ఒక్క పీరియడైనా సరిగ్గా చదువు చెపుతారా అని?"



మాధవయ్య: "ప్రైమరీస్కూళ్ళ టీచర్లు, మునిసిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల జీవనం రోజురోజుకి అధోగతేకదా!"

నిఖిలేశ్వర్